సాక్షి ఖమ్మం

బుధవారం । 31 । జూలై । 2024



మహిళల ఆర్థికాభివృద్ధే...

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బోనకల్‌లో ఇందిరా డెయిరీ ఏర్పాటుకు చకచకా అడుగులు పడుతున్నాయి.

10లో



ఆడుతూ.. ఆరా తీస్తూ

కేంద్ర అధికారుల బృందం విద్యార్థులను ప్రోత్సహించేలా వారితో ఆడిపాడుతూనే పథకాలను అధ్యయనం చేస్తోంది.

10లో

గరిష్టం / కనిష్టం

33° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

డీఎల్‌ఈడీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: భద్రాచలంలోని గిరిజన కళాశాలలో 2024–26 విద్యాసంవత్సరానికి గాను డీఎల్‌ఈడీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. మొత్తం 50 సీట్లకు గాను ఏజెన్సీ ప్రాంతీయులై ఉండి ఇంటర్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. భద్రాచలంతో పాటు ఉట్నూరు, ఏటూరునాగారం ఐటీడీఏల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు భద్రాచలంలోని కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి సెప్టెంబర్ 25వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని పీఓ తెలిపారు.

వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వివిధ విభాగాల వైద్యుల నియామకానికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన తొమ్మిది మంది ప్రొఫెసర్లు, 11మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, ఏడుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనేపథ్యాన దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించగా అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ మాలతి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్ గౌడ్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. మొత్తం 16 మంది వైద్యులు హాజరు నలుగురిని మాత్రమే ఎంపిక చేశారు. మిగతా పోస్టుల భర్తీకి మరోమారు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

రేపటి నుంచి 'మెడికల్' పరీక్షలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ మొదటి సంవత్సర విద్యార్థులకు గురువారం నుంచి వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. ఈమేరకు 1వ తేదీ బయోకెమిస్ట్రీ పేపర్–1, 3న పేపర్–2, 5న అనాటమీ పేపర్–1, 7న పేపర్–2, 9న ఫిజియాలజీ పేపర్–1, 12న పేపర్–2 పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నుంచి పరీక్షల షెడ్యూల్ విడుదలైందని తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించేందుకు జిల్లా రిసోర్స్ పర్సన్లకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ సూచించారు. ఖమ్మంలోని డైట్ కళాశాలలో డీఆర్పీలకు మంగళవారం మొదలైన శిక్షణలో ఆయన మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్లు మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. కోర్స్ డైరెక్టర్, డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్‌తో పాటు పెసర ప్రభాకర్‌రెడ్డి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.


హైవేపై హైకోర్టులో మరో రెండు పిటీషన్లు

రఘునాథపాలెం: నాగపూర్–అమరావతి వరకు నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే భూసేకరణపై అభ్యంతరం తెలుపుతూ హైకోర్టులో మరో రెండు పిటీషన్లు దాఖలయ్యాయి. వీటిని పరిశీలించిన కోర్టు మంగళవారం తమకు అనుకూలంగా స్టే విధించిందని రైతులు, ప్లాట్ల యజమానులు వెల్లడించారు. ఎన్‌హెచ్ 163–జీ పేరుతో నిర్మిస్తున్న హైవేకు సంబంధించి ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్ మండలాల్లోని తీర్థాల, కామంచికల్, రేగులచలక, వీవీపాలెంకు చెందిన 40 మంది రైతులు, ప్లాట్ల యజమానులే కాక రేగులచలకకు చెందిన ముగ్గురు గ్రానైట్ క్వారీల యజమానులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే కలెక్టరేట్ వెనకాల పాట్లు ఉన్న 17 మంది, వీ.వీ.పాలెం సెక్షన్‌లో 29 మంది రైతులు, ప్లాట్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించగా స్టే వచ్చిన విషయం విదితమే. తాజాగా మరో 40 మంది కోర్టును ఆశ్రయించడంతో స్టే వచ్చింది. హైవే నిర్మాణంలో నిబంధనలకు విరుద్ధంగా భూసేకరణ చేపడుతున్నారని ఖమ్మం నగరం మధ్య నుంచి వెళ్లేలా అలైన్‌మెంట్ ఉండడంతో పలువురికి నష్టం జరుగుతోందని వీరందరూ కోర్టును ఆశ్రయించగా, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు భూములు స్వాధీనం చేసుకోవద్దని ఆదేశించిందని తెలిపారు.

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసి పాలన గాడిన పడడంతో ప్రభుత్వం స్థానిక సంస్థల సమరానికి సిద్ధమవుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో గ్రామపంచాయతీ పాలక వర్గాల గడువు ముగియగా ఇటీవల ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించినట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే, ఎన్నికలకు సిద్ధం కావాలని అధికారులను గతంలోనే ఎన్నికల సంఘం ఆదేశించినా రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారు కాకపోవడంతో అడుగు పడలేదు. ఇటీవల అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఎన్నికలకు ఉన్న అడ్డంకులపై ఆరా తీయడంతో రిజర్వేషన్ల ఖరారుపై చర్చించిన నేపథ్యాన రెండు, మూడు నెలల్లో పంచాయతీ పోరు జరగొచ్చని తెలుస్తోంది.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

పంచాయతీ పోరు దిశగా..



- జీపీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు
- ప్రక్రియను వేగవంతం చేసిన జిల్లా అధికారులు
- ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి రెడీ
- రిజర్వేషన్లు ఖరారైతే సమరంపై స్పష్టత

ఇన్‌చార్జిల పర్యవేక్షణలోనే..

జిల్లాలోని 589 గ్రామపంచాయతీలకు గాను 584 జీపీలకు 2019లో ఎన్నికలు నిర్వహించగా అదే ఏడాది ఫిబ్రవరి 2న పాలకవర్గాలు కొలువుదీరాయి. వీటి పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1న ముగిసింది. అప్పటి నుంచి గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ పారిశుద్ధ్యం, వైద్యశిబిరాల ఏర్పాట్లలో ఆలస్యమవుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది.

అంతా సిద్ధమైనా..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ప్రకటించారు. అలాగే రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆదేశాలను పంపింది. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలను సైతం సేకరించింది. ఈనేపథ్యాన అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర సామాగ్రిని సిద్ధం చేశారు. కానీ రకరకాల అడ్డంకుల నేపథ్యాన ఎన్నికల నిర్వహణ సాధ్యం కాలేదు.

జిల్లాలో గ్రామపంచాయతీలు	589
2019లో ఎన్నికలు నిర్వహించినవి	584
జిల్లాలో వార్డులు	5,389
సిద్ధం ఉన్న బ్యాలెట్ బాక్స్‌లు	1,895
ఏపీ నుంచి తెప్పించినవి	1,369
మొత్తం బ్యాలెట్ బాక్స్‌లు	3,264
ప్రస్తుత జాబితా ఆధారంగా ఓటర్లు	7,50,310

ఇవీ అడ్డంకులు..

ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగకపోవడానికి ఓటర్ల జాబితా సిద్ధంగా లేకపోవడం, రిజర్వేషన్లు ఖరారు కాకపోవడం కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట ఎన్నికల సంఘానికి కొత్త ఓటర్ల జాబితా మరో వారంలోగా అందే అవకాశమున్నట్లు సమాచారం. ఈ జాబితాపై ప్రభుత్వపరంగా కసరత్తు పూర్తయితే జీపీలకు రెండు, మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం ఉంది. అయితే, 2019 ఎన్నికల సందర్భంగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం గ్రామపంచాయతీలకు పదేళ్ల పాటు రిజర్వేషన్లు కొనసాగించే వీలుంది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను కొనసాగిస్తుందా.. మళ్లీ రిజర్వేషన్లు ఖరారు చేస్తుందా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. అయితే కులగణన ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాను లెక్కించి రిజర్వేషన్లు ఖరారు చేయాలంటే సమయం పడుతుంది. ఈ నేపథ్యాన లోక్‌సభ ఎన్నికల సమయాన రూపొందించిన ఓటర్ల జాబితా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఇదే జరిగితే గత ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్లు ఈ ఎన్నికల్లో అమలయ్యే అవకాశముండదు.

మరోసారి ఎన్నికల సందడి..

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ అనుకున్నట్లు మొదలైతే మరోమారు సందడి నెలకొననుంది. అంతేకాక మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు కూడా నిర్వహించాల్సి ఉండడంతో గ్రామాల్లో రాజకీయాలు రసకందాయంలో పడనున్నాయి. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పనిచేసిన గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. నేతల గెలుపునకు శాయశక్తులా పనిచేసిన వారు తామూ గెలిచి పట్టు నిరూపించుకోవాలనే ఆలోచనతో ఉన్నారు. దీంతో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా అని ఎదురు చూస్తున్నారు. మరోపక్క గత పాలకవర్గాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లుగానే కాక వార్డు సభ్యులుగా కొనసాగిన వారు మరోమారు అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. వీరికి తోడు కొత్త వారు సైతం పోటీకి సిద్ధమవుతుండడంతో గ్రామాల్లో ఇప్పటినుంచే సందడి మొదలైంది.

అర్హులందరికీ రుణమాఫీ



టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన వివిధ శాఖల అధికారులు

- అధికారులు పకడ్బందీగా పర్యవేక్షించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: రూ.లక్షన్నర మేర పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ మాఫీ వర్తించేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. రెండో విడత రుణమాఫీ నిధులను మంగళవారం విడుదల చేసిన నేపథ్యాన ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు విడతల్లో కలిపి జిల్లాలో 91, 973 మంది రైతులకు రుణమాఫీ అమలైందని తెలిపారు. ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఈ అంశంపై ఫిర్యాదుల నమోదు కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

కొత్త ప్రయోగాలు చేయాలి

రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వ్యవసాయ అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పలు అంశాలపై సమీక్షించారు. ఏఈఓలు తమ క్లస్టర్ పరిధిలో వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు, ప్రయత్నాలు చేయాలని సూచించారు. రైతు వేదికల్లో టాయిలెట్లు, ఫర్నీచర్, లైట్లు, ఫ్యాన్లు సమకూరుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీచైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణ, రైతు సమన్వయ సమితి మాజీ చైర్మన్ నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ప్రోత్సాహం

ఖమ్మంఅర్బన్: పరిశ్రమల ఏర్పాటులో మహిళా సంఘాలను ప్రోత్సహిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే మహిళాశక్తి పథకం ఉద్దేశమని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో మహిళా సమాఖ్యలకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సభ్యులకు ఉన్న నైపుణ్యాల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటుచేస్తే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. డీఆర్డీఓ సన్యాసయ్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, డీఈఓ సోమశేఖర్‌శర్మ, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, అదనపు డీఆర్డీఓ నూరొద్దీన్, మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు టి.సుహాసిని పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళిక విడుదల

5.51 లక్షల మందికి రూ. 11,991 కోట్ల రుణాలు



రుణప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వార్షిక రుణ ప్రణాళికను లీడ్ బ్యాంక్ మంగళవారం విడుదల చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి వివిధ విభాగాల కింద 5,51,586 మందికి రూ.11,991.51 కోట్ల రుణాలుగా ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఈమేరకు పంట రుణాలు, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలకు గాను 4,07,453 మందికి రూ. 6,256.42 కోట్ల మేర రుణం ఇవ్వనుండగా ఇందులో పంటరుణాలు రూ.3,520.54 కోట్లు ఉన్నాయి. కాగా, వానాకాలం పంట రుణాలను 1,86,827 మంది రైతులకు రూ.2,111 కోట్లు, యాసంగిలో 1,24,552 మంది రైతులకు రూ.1,409.54 కోట్ల మేర రుణాన్ని 30 బ్యాంకుల ద్వారా ఇవ్వాలని నిర్దేశించారు. అలాగే, సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు 26,370 మందికి రూ.2,591.51 కోట్లు, విద్య, గృహ నిర్మాణ, ఇతర రుణాలు 4,37,459 మందికి రూ. 9,078.61 కోట్లు ఇవ్వాలని ప్రణాళికలో వెల్లడించారు. కాగా, వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆవిష్కరించారు.

లంకాసాగర్–గూడూరు మధ్య విద్యుత్ లింక్‌లైన్

6.62 కి.మీ.కు రూ.50 లక్షలతో ప్రతిపాదనలు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ అధిక లోడ్‌ను నియంత్రించడంతో పాటు అంతరాయాలు లేకుండా సరఫరా చేసేలా జిల్లాలోని లంకాసాగర్ – గూడూరు 33/11 సబ్‌స్టేషన్ల మధ్య 33 కే.వీ లింక్ లైన్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ ప్రతిపాదించింది. 6.62 కి.మీ. పొడవుతో నిర్మించే ఈ లైన్‌కు రూ.50 లక్షల వరకు వ్యయమవుతుందని చెబుతున్నారు. పెనుబల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గూడూరు ఫీడర్‌పై సామర్థ్యానికి మించి లోడ్ పడుతోందని గుర్తించారు. ఈ నేపథ్యాన లింక్ లైన్ ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ తెలిపారు. ఈ లింక్ లైన్ ఏర్పాటైతే లంకాసాగర్, గూడూరు, బీరవెల్లి, రాయుడుపాలెం, వేంసూరు సబ్‌స్టేషన్లలో పరిధిలోని 26గ్రామాలకు ప్రయోజనం ఉంటుందని వెల్లడించారు.

రేపటి నుంచి ధృవపత్రాల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు(డీఈఈసీఈటీ)లో అర్హత సాధించిన అభ్యర్థుల ధృవపత్రాలను ఆగస్టు 1వ తేదీ 6వ తేదీ వరకు పరిశీలించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు. డైట్‌లో జరిగే ధృవపత్రాల పరిశీలన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. డీఈఈసీఈటీ ఆన్‌లైన్ దరఖాస్తు, హాల్ టికెట్, ర్యాంక్‌కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, ఇంటర్ వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణపత్రం, తాజాగా తీసుకున్న ఆదాయ ధృవపత్రం తీసుకురావాలని, వివరాలకు deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

కేఎంసీ ఇంజనీర్ల బదిలీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న ముగ్గురు బదిలీ అయ్యారు. నర్సంపేట మున్సిపాలిటీ నుండి ఖమ్మం కార్పొరేషన్‌లో డిప్యూటేషన్‌పై ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న సతీష్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు, మరో ఏఈ కుమార్ మహబూబాబాద్‌కు, నవ్యజ్యోతిని కొత్తగూడెం సబ్‌డివిజన్ పబ్లిక్ హెల్త్ ఏఈగా బదిలీ చేశారు. అలాగే, జగిత్యాల నుండి చరణ్‌తేజ, నిజామాబాద్ మున్సిపాలిటీ నుండి యాకూబ్ అలీ కేఎంసీకి ఏఈలుగా బదిలీపై రానున్నారు.

రెండో విడతలో 33,942 మంది..



హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా రుణమాఫీ చెక్కు అందుకుంటున్న గణేశ్వరానికి చెందిన చెందిన మహిళా రైతు శైలజ, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులు

- రుణమాఫీ నిధులు రూ.262.50 కోట్లు విడుదల
- ఇప్పటి వరకు జిల్లాలో 91 వేల మందికి మాఫీ
- డీసీసీబీలో అర్హులకు అందని ప్రయోజనం

ఖమ్మంవ్యవసాయం: పంట రుణాల మాఫీ పథకం రెండో విడత కింద ప్రభుత్వం మంగళవారం నిధులు విడుదల చేసింది. ఈమేరకు జిల్లాలో 33,942 మంది రైతులు రూ.1.50 లక్షలలోపు తీసుకున్న పంట రుణాలు మాఫీ కానున్నాయి. ఈ విడతలో జిల్లాలోని 33,942 మందిని అర్హులుగా గుర్తించి.. వీరి రుణాలు, వడ్డీ కలిపి రూ.262.50 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. వాణిజ్య బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయగా.. పీఏసీఎస్‌ల నుంచి రుణాలు తీసుకున్న వారికి డీసీసీబీకి విడుదలయ్యాయి. కాగా, హైదరాబాద్‌లో రెండో విడత రుణమాఫీ ప్రక్రియను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించగా జిల్లాలోని 21 మండలాల్లో రైతు వేదికల ద్వారా అధికారులు, రైతులు వీక్షించారు.

రెండు విడతల్లో 91,799 మందికి..

జిల్లాలో మొదటి, రెండో విడతల్లో మొత్తం 91,799 మంది రైతులకు రూ. 520,76,32,345 మేర రుణమాఫీ జరిగింది. మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలు కలిగిన 57,875 మందికి రూ.258,25,75,452, రెండవ విడతలో రూ. 1.50 లక్షల వరకు రుణాలు కలిగిన 33,942 మంది రైతులకు రూ.262,50,56,893ను ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతతో పోలిస్తే రెండో విడతలో తక్కువ మందికే రుణమాఫీ కాగా.. రుణ నగదు మాత్రం కాస్త ఎక్కువగా ఉంది. ఆగస్టు 15 నాటికి రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్న వారికి సైతం మాఫీ వర్తించే అవకాశముంది. జిల్లాలో మొత్తంగా 3.21 లక్షల మంది రైతులు సుమారు రూ. 2,300 కోట్ల పంట రుణాలు తీసుకున్నట్లు అంచనా. ఇందులో ఇంకా 2.30 లక్షల మంది మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు.

డీసీసీబీ పరిధిలో అంతంతే...

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిధిలో రెండో విడత రుణమాఫీ నామమాత్రంగానే జరిగింది. ఈ విడతలో19,504 మంది రైతులను అర్హులుగా గుర్తించగా.. వీరు తీసుకున్న రుణమొత్తం రూ.88,09,04,542ను ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతలో 37,625 మంది రైతులకు రూ.21,63,40,360 రుణమాఫీ జరగగా.. ఇప్పటి వరకు 57,129 మంది రైతులకు మాత్రమే మాఫీ వర్తించినట్లయింది. కాగా, ఈ బ్యాంకు పరిధిలో 1,69,864 మంది రైతులకు రూ.892 కోట్లు మాఫీ కావాల్సి ఉందని అంచనా. ఇందులో 57,129 మందికే మాఫీ కావడంతో మిగతా వారంతా మూడో విడతపై ఆశలు పెట్టుకున్నారు.

సీఎం చేతుల మీదుగా రుణమాఫీ చెక్కు

రఘునాథపాలెం: హైదరాబాద్‌లో రెండో విడత రుణమాఫీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈకార్యక్రమంలో రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామానికి చెందిన మహిళా రైతు బదావత్ శైలజ చెక్కు అందుకున్నారు. ఆమెకు ఖమ్మంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ.1.37 లక్షల పంటరుణం ఉంది. మహిళా రైతు వెంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు రమేష్, తమ్మిన్ని నాగేశ్వరరావు హైదరాబాద్ వెళ్లారు.

వేగ నియంత్రణతోనే సురక్షిత ప్రయాణం



ప్రమాదరహిత డ్రైవర్లుగా ఎంపికైన వారితో సీపీ సునీల్ దత్, ఆర్‌ఎం సరిరామ్ తదితరులు

ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల్లో సీపీ సునీల్‌దత్

ఖమ్మంమయూరిసెంటర్: రోడ్డుపై వాహనాలు నడిపే డ్రైవర్లు వేగాన్ని నియంత్రించుకోవాలని.. ప్రధానంగా ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు ఈ సూచన పాటించాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు సమావేశం మంగళవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రీజియన్ స్థాయిలో ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందిన వారిని సీపీ సత్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో అతి తక్కువ ప్రమాదాల శాతం కలిగిన సంస్థ ఆర్టీసీ మాత్రమేనని తెలిపారు. లక్షలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న డ్రైవర్లు దేవుళ్లతో సమానమని చెప్పారు. ఆర్టీసీ ఆర్‌ఎం ఏ.సరిరామ్ మాట్లాడుతూ ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు సూచనలు చేయడంతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.

ఉత్తమ డ్రైవర్లు వీరే...

ఖమ్మం రీజియన్ స్థాయిలో సత్తుపల్లి డిపోకు చెందిన ఎస్.వీ.ఎస్.రావు 31ఏళ్ల 11 నెలల సర్వీస్‌లో ఒక్కప్రమాదం చేయని డ్రైవర్‌గా మొదటి స్థానంలో నిలిచారని ఆర్‌ఎం తెలిపారు. అలాగే, ఖమ్మం డిపోకు చెందిన డి.అంథోని, బి.రాములు 27ఏళ్ల 11 నెలల సర్వీస్‌లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నారని చెప్పారు. అంతేకాక ప్రతీ డిపోకు ముగ్గురు ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్టీఓ వెంకటరమణ, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ జీ.ఎస్.పవిత్ర, డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి క్రీడోత్సవాల్లో తమ కళాశాల విద్యార్థిని ధరంసోత్ సింధుప్రియ ప్రతిభ చాటి అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. కళాశాలలో విద్యార్థిని మంగళవారం ఆమె అభినందించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్ అయిన సింధుప్రియ 400మీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచి స్వర్ణపతకం సాధించగా, సెప్టెంబర్‌లో నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. అనంతరం ఆమెకు హిస్టరీ అధ్యాపకుడు వెంకటేశ్వర్లు రూ.2వేల ప్రోత్సాహక నగదు అందజేశారు. ఎన్ఎస్ఎస్ పీఓలు రామకుమారస్వామి, మార్టియానా, పీడీ రఘునందన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మారథాన్‌లో పతకం సాధించిన కానిస్టేబుల్



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ, తదితరులు

ఖమ్మంక్రైం: ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ పిల్లి రాజు ఈనెల 28న సిద్దిపేటలో నిర్వహించిన 21 కి.మీ. మారథాన్‌లో పాల్గొని పతకం సాధించారు. ఈసందర్భంగా ఆయనను డీఎస్పీ ఫణీందర్ సన్మానించారు. కానిస్టేబుల్‌కు 25కేజీల బాదంపప్పు అందించి సన్మానం చేయగా ఎస్సైలు రంజిత్‌కుమార్, శ్యాం, హెడ్ కానిస్టేబుళ్లు పిల్లి శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కలిసి పిల్లి రాజును 25 కేజీల బాదం పప్పుతో సన్మానం చేశారు.

ఖజానా శాఖలో వార్షిక తనిఖీలు

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక తనిఖీలు మొదలయ్యాయి. ఈమేరకు మంగళవారం అకౌంటెంట్ జనరల్(ఏజీ) అధికారులు రికార్డులను పరిశీలించారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రసాద్‌తో పాటు మరో ముగ్గురితో కూడిన బృందం ఐదు రోజుల పాటు తనిఖీ చేయనుందని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ, ఉద్యోగులు మోదుగు వేలాద్రి, కంచి శ్రీను, మంజుల, ప్రసన్న, కొమరగిరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఉన్న వ్యవసాయాధికారికి అస్వస్థత

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి(టెక్నికల్)గా విధులు నిర్వర్తిస్తున్న వినయ్‌కుమార్ మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. ఆయన రుణమాఫీ జిల్లా నోడల్ అధికారిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా.. మంగళవారం ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించింది. ఈమేరకు పర్యవేక్షణలో నిమగ్నమైన ఉన్న వినయ్‌కుమార్ ఉన్నట్లుండి కార్యాలయంలోనే కుప్పకూలి పడిపోయారు. దీంతో సహచర ఉద్యోగులు ఆయనను ఆస్పత్రికి తరలించగా బీపీ పడిపోవడంతో ఇలా జరిగిందని నిర్ధారించిన వైద్యులు చికిత్స అనంతరం ఇంటికి పంపించారు.

ఏపీ నుంచి ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

ఎర్రుపాలెం: ఏపీ నుంచి అక్రమంగా ఖమ్మంకు ఇసుక తరలిస్తున్న లారీని ఎర్రుపాలెం పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కీసర నుండి ఖమ్మంకు ఇసుక తరలిస్తుండగా ఎర్రుపాలెం వద్ద పోలీసులు తనిఖీ చేపట్టారు. లారీ డ్రైవర్ చల్లా నాగరాజు వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఆయనను అదుపులోకి తీసుకుని లారీ సీజ్ చేశారు. ఖమ్మంకు చెందిన లారీ యజమాని చలమల వెంకటేశ్వరరావు, రావిచెట్టు వెంకట్రావు సహకారంతో ఇసుక తరలిస్తున్నట్లు తేలగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వెంకటేష్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
కందులు	---	---
మిర్చి	17,000	9,000
ఏసీ మిర్చి	19,400	10,000
ఏసీ తాలు	9,500	7,000
పత్తి	7,250	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,705

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా..

- ఇందిరా డెయిరీ ఏర్పాటుకు వడివడిగా అడుగులు
- బోనకల్‌లో 9.24 ఎకరాల భూసేకరణ
- మహిళలే వాటాదారులు.. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన
- మండలాల్లో పాల శీతలీకరణ కేంద్రాలు కూడా..
- డిప్యూటీ సీఎం భట్టి చొరవతో జోరందుకున్న ప్రక్రియ



వాటాదారులకు 2013లో పత్రాలు అందజేస్తున్న ఆనాటి డిప్యూటీ స్పీకర్ భట్టి విక్రమార్క

బోనకల్: రాష్ట్రంలోనే తొలిసారి మహిళలే వాటాదారులుగా మధిర నియోజకవర్గంలోని బోనకల్‌లో ఇందిరా డెయిరీ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క 2013లోనే డెయిరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అప్పట్లోనే బోనకల్‌లో 9.24 ఎకరాల భూమి సేకరించి శంకుస్థాపన చేసినా ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో డెయిరీ తెర మీదకు వచ్చింది.

వాటాదారులుగా మహిళలు

మధిర నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల్లో 61 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరందరిని వాటాదారులుగా చేర్చి పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడం.. లాభాలు ఆ మహిళలకే చెందాలనే లక్ష్యంతో డెయిరీ ఏర్పాటుకు భట్టి నిర్ణయించారు. ఇందుకోసం సుమారు రూ.80 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. దీంతో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 4,133 మంది మహిళల నుంచి రూ.36 లక్షలు వాటాధనాన్ని 2013లోనే సేకరించి బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. అంతేకాక 2013 అక్టోబర్ 20 నుంచి 24వ తేదీ వరకు స్వయం సహాయక సంఘాల సభ్యులు, అధికారులతో కలిసి భట్టి విక్రమార్క గుజరాత్ రాష్ట్రంలోని అమూల్, ఆనంద్ డెయిరీలను సందర్శించారు. ఆ తర్వాత ఇందిరా పాడి పరిశ్రమల సహకార సంఘం లిమిటెడ్ పేరుతో డెయిరీ రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది కొన్నాళ్లు మరుగున పడినా ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి రావడం, భట్టికి డిప్యూటీ సీఎం పదవి దక్కడంతో మిగిలిన మహిళల నుంచి సైతం వాటాధనాన్ని సేకరిస్తున్నారు. కొత్తగా 3082 మంది మహిళలను వాటాదారులుగా చేర్చుకొని రూ.2,100 వసూలు చేశారు.



బోనకల్‌లో ఇందిరా డెయిరీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

డెయిరీ ఏర్పాటు కోసం ఒక్కో మహిళకు 70 శాతం సబ్సిడీపై రూ.2 లక్షల విలువ చేసే గేదెలను అందజేయనున్నారు.

యువతకు ఉపాధి, ఆర్థిక భరోసా

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు సబ్సిడీపై పాడి గేదెలు అందజేసి.. ఆపై పాలను ఇందిరా డెయిరీ ద్వారా సేకరిస్తారు. ఈ పాలు, పాల ఉత్పత్తులను విక్రయించి వచ్చే లాభాలను వాటాదారులకు పంచనుండగా.. మహిళలు ఆర్థికంగా బలోపేతమవుతారని చెబుతున్నారు. అంతేకాక స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. గ్రామాల్లో పాల సేకరణ వాహనాలు, గడ్డి కటింగ్, దాణా మిక్సింగ్ యంత్రాలను సమకూర్చనున్నట్లు తెలుస్తోంది.

మండలాల్లో శీతలీకరణ కేంద్రాలు

నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో ఇందిరా డెయిరీ ఆధ్వర్యాన శీతలీకరణ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం ఇప్పటికే స్థలాల పరిశీలన, ఎంపిక ఓ కొలిక్కి వచ్చింది. బోనకల్ మండలం రావినూతలలో 30 కుంటల భూమిని అధికారులు సేకరించారు. మిగిలిన నాలుగు మండలాల్లోనూ ప్రధాన రహదారుల వెంట భూములను పరిశీలించే ప్రక్రియ చివరి దశకు చేరింది. ఆయా ప్రాంతాల్లో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడి నుంచి పాలను ఇందిరా డెయిరీకి పంపిస్తారు.

వాటాదారురాలిగా చేరా..



రూ.2,100 చెల్లించి వాటాదారురాలిగా చేరాను. డెయిరీ ఏర్పాటు కాగానే గేదెల కొనుగోలుకు రూ.2లక్షల సబ్సిడీ రుణం ఇస్తామని చెప్పారు. గేదెల పాలను డెయిరీకి విక్రయించడం ద్వారా వచ్చే నగదుతో అప్పు తీరుస్తా. ఆపై వచ్చే నగదు ఇంటి అవసరాలు తీరి ఆర్థికంగా నిలబడతాం.

–షేక్ సైదాబీ, ఆళ్లపాడు

సభ్యుల ఆర్థికాభివృద్ధి కోసం..



స్వయం సంఘాల్లో సభ్యుల ఆర్థికాభివృద్ధి కోసం ఇందిరా డెయిరీ ఎంతగానో ఉపయోగపడుతుంది. బోనకల్ మండలంలో ఇప్పటి వరకు 4 వేల మంది మహిళలను వాటాదారులుగా చేర్చాం. సంఘాల్లోని సభ్యులకు అవగాహన కల్పించి మరింత మందిని చేర్చడమే కాక లాభాలు పొందేలా కృషి చేస్తాం.

–పద్మలత, ఐకేపీ ఏపీఎం

విద్యార్థులతో ఆడుతూ.. ఆరా తీస్తూ

కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వ అధికారుల అధ్యయనం

నేలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అధికారుల శిక్షణ, అధ్యయనం జిల్లాలో కొనసాగుతోంది. ఈమేరకు నేలకొండపల్లి మండలం నాచేపల్లిలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన అధికారులు విద్యార్థులకు అందుతున్న సేవలు తెలుసుకోవడంతో పాటు వారితో ఆడిపాడి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మోహన్ భారతి, అభిషేక్ దేశ్‌వాల్, ఆర్యమ యుగంనకర్, రమణదీప్‌తో పాటు ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య, సీడీపీఓ బాలత్రిపుర సుందరి, సూపర్‌వైజర్ నాగమణి, హెచ్ఎంలు వి.రామకృష్ణ, ఏ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పి.బాబురావు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

- మధిర: మండలంలోని ఖమ్మంపాడు ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన అధికారులు విద్యార్థుల ప్రతిభ, వసతులను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆతర్వాత రైతు వేదిక, డ్వాక్రా సంఘాల పనితీరు, ఉపాధి హామీ పథకం తీరుతెన్నులు పరిశీలించారు. ఈ బృందంలో నీష్ కుమార్, అశ్వనీకుమార్, రోహిత్ కుమార్, వికాస్ కుమార్ ఉండగా ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు ఆర్.వీ.సత్యనారాయణ, జి.రామచంద్రారెడ్డి, ఎస్.కే.మదార్, లక్ష్మీప్రసన్న, ఆర్.బ్రహ్మారెడ్డి, కె.సునీత, ఎస్.కే.జమీర్ పాల్గొన్నారు.
- ఏన్కూరు: ఏన్కూరు మండలం నాచారంలో పర్యటించిన అధికారులు ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న రాగిజావ, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఆతర్వాత అంగన్‌వాడీ కేంద్రంలో అమలవుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.



నేలకొండపల్లి : విద్యార్థినులతో కలిసి కబడ్డీ ఆడుతున్న అధికారి



ఏన్కూరు : నాగారంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కేంద్రబృందం

బృందం సభ్యులు కరణభాటి, రిథమ్ బానిక్, సచిన్‌భర్తీ, కుషా విరాట్, ప్రథమ్‌వ్యాస్‌తో పాటు తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఎంపీడీఓ సకినాల రమేష్, ఏఈ నర్సింహరావు, హెచ్ఎం ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, పల్లె ప్రకృతివనం, రేషన్‌షాపును అధికారులు పరిశీలించారు. పలుచోట్ల లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర అధికారుల బృందం సభ్యులు సాహిల్, భువనేష్ పాండే, రోహిత్ గోస్సైల్, సందీప్ ఠాకూర్‌తో పాటు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ సురేష్‌బాబు, ఏఓ రూప, ఏపీఎం వెంకటరామారావు పాల్గొన్నారు.

రుణమాఫీ చారిత్రక నిర్ణయం

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతుల రుణాలు మాఫీ చేస్తుండడం చారిత్రక నిర్ణయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. రెండో విడతలో రూ.1.50 లక్షల మేర రైతుల రుణాలు మాఫీ చేసిన సందర్భంగా మంగళవారం కొనిజర్ల మండలం చిన్నమునగాలలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ రూ.లక్ష రుణ మాఫీతో అప్పట్లో చరిత్ర సృష్టిస్తే మళ్లీ ఇప్పుడు రూ.2 లక్షలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, కాంగ్రెస్ జిల్లా



సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దుర్గాప్రసాద్, తదితరులు

అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు వడ్డె నారాయణరావు, వై.చిరంజీవి, పూనాటి బాబు, సురేష్, నవీన్, వెంకటయ్య, చుక్కయ్య, చినబాబు, నర్సింహారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

తల్లీకుమార్తెకు తీవ్రగాయాలు

వేంసూరు: పక్కా ఇల్లు లేకపోయినా రెక్కల కష్టాన్నే నమ్ముకుని పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో దంపతులిద్దరూ కూలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. ఉన్నంతలో సంతృప్తిగా జీవిస్తున్న వారి కుటుంబాన్ని అగ్ని ప్రమాదం చిన్నాభిన్నం చేసింది. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వేంసూరు మండలం రామన్నపాలెంకు చెందిన చుక్క హరిబాబు, రోజా దంపతులు కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలతో కలిసి పైన తాటాకులు, చుట్టూ రేకులతో నిర్మించిన గుడిసెలో జీవిస్తున్నారు. అయితే, మంగళవారం తెల్లవారుజామున వారి ఇంటి సమీపాన 33 కేవీ విద్యుత్ లైన్‌కు బొప్పాయి చెట్టు తగిలి నిప్పురవ్వలు గుడిసెపై పడ్డాయి. దీంతో మంటలు అంటుకోగా హరిబాబు ఆయన కుమారుడు విష్ణు బయటకు వచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేయగా.. అంతలోనే మంటలు ఎగిసిపడి ఇంట్లోని ఫ్రిడ్జి పేలింది. ఈమేరకు ఇంట్లో ఉన్న రోజా, ఆమె కుమార్తె వైష్ణవికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదేఘటనలో హరిబాబు, ఆయన కుమారుడు కూడా గాయపడగా నలుగురిని స్థానికులు తిరువూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే, రోజా, వైష్ణవికి తీవ్రగాయాలు కావడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అడసర్లపాడు జెడ్పీహెచ్ఎస్‌లో వైష్ణవి 8వ తరగతి, విష్ణు 9వ తరగతి చదువుతున్నాడు. హరిబాబు రోజు కూలీలకు ముఠామేస్త్రీగా పంచాల్సిన రూ.లక్ష నగదు, 5 తులాల బంగారం, వెండి ఆభరణాలతో పాటు సామగ్రి పూర్తిగా కాలిపోవడమేకాక కుటుంబమంతా గాయాల పాలు కావడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఘటనాస్థలిని తహసీల్దార్ ఎం.ఏ.రాజు, ఎంపీడీఓ రమాదేవి, ఎస్ఐ వీరప్రసాద్, ఆర్ఐ చిరంజీవి పరిశీలించారు.



ఇంట్లో కాలిపోయిన సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై దృష్టి



తల్లాడలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తల్లాడ: సుదీర్ఘ కాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని తల్లాడ, అన్నారుగూడెం, బిల్లుపాడు, నూతనకల్లు, మిట్టపల్లి, కుర్నవల్లి, పినపాక హైస్కూళ్లలో మంగళవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టగా ఆయన మాట్లాడారు. మెరుగైన పీఆర్సీ ఇప్పించిన ఘనత తమదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెలిశెట్టి నర్సింహారావు, రఫీక్ పాషా, భాస్కర్, దగ్గుల కమలాకర్‌రెడ్డి, ఉంగరాల వెంకటేశ్వర్లు, సున్నా శ్రీను, పోలూరి వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ఉద్యమాలు

ఖమ్మంమయూరిసెంటర్: అసెంబ్లీ ఎన్నికల సమయాన కాంగ్రెస్‌లో ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలుచేయాలనే డిమాండ్‌తో ఉద్యమాలు చేపట్టనున్నట్లు మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. ఆగస్టు 1న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, 8న కలెక్టరేట్ ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్లు నెరవేరకపోతే ఆగస్టు 21న ఛలో హైదరాబాద్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు శిరోమణి, ఝాన్సీ, కె.శ్రీను, శోభ, సురేష్, బాబు, లాజర్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

సొంత స్థలమంటూ ఖననాన్ని అడ్డుకున్న పలువురు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరానికి చెందిన షేక్ ఖాసింసాహెబ్ (40) సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. అయితే, ఆయన మృతదేహాన్ని ఖననం చేసే సమయాన తమ స్థలమని చెబుతూ కొందరు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కొన్నేళ్లుగా ఖాసిం మద్యానికి బానిస కావడంతో ఆయన భార్య ఇమామ్‌బీకి మధ్య మనస్పర్థలు ఏర్పడి గొడవలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం ఆమె తన అక్క ఇంటికి వెళ్లిపోగా మనస్తాపానికి గురైన ఖాసిం సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, మంగళవారం ఆయన మృతదేహాన్ని ఖబరస్థాన్‌లో ఖననం చేసేందుకు తీసుకెళ్లగా కొందరు అడ్డుకున్నారు. ఈమేరకు ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్, ఆర్ఐ శ్రీకాంత్ చేరుకుని వారికి నచ్చచెప్పారు. అయినప్పటికీ అది సొంత స్థలమని వారు స్పష్టం చేయడంతో చివరకు ఖాసిం మృతదేహాన్ని చెరువు సమీపాన మరో స్థలంలో ఖననం చేశారు.

ఉరి వేసుకుని వివాహిత...

ఖమ్మం క్రైం: ఖమ్మం పార్శీబంధానికి చెందిన ఓ వివాహిత మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పస్రం జ్యోతి(30) అనారోగ్య కారణాలతో కొంత కాలంగా అవస్థ పడుతోంది. ఈనేపథ్యాన మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆమెకు భర్త నాగయ్య, ముగ్గురు పిల్లలు ఉండగా జ్యోతి తండ్రి శ్రీను ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.



స్థానికులతో చర్చిస్తున్న ఎస్సై వంశీకృష్ణ

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని ముజ్జుగూడెంకు చెందిన షర్మిల(16) మంగళవారం రాత్రి ఇంట్లో ఉన్న గడ్డి నివారణ మందు తాగింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న షర్మిల ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యంపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లి కేసీఆర్ టవర్స్‌లో నివాసముంటున్న ప్రైవేట్ ఉద్యోగి దేవర దిలీప్ కానరాకుండా పోవడంతో ఆయన భార్య శిరీష ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈనెల 26న దిలీప్ పనిచేసే పాల కంపెనీకి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఎక్కడ ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు

ముదిగొండ: పాఠశాలకు వెళ్తున్న బాలుడిపై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ముదిగొండ మండలం అమ్మపేటకు చెందిన ఒకటో తరగతి విద్యార్థి మాదుగుల వరుణ్‌తేజ్ తన స్నేహితులతో కలిసి మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్తున్నాడు. ఈక్రమాన గుంపుగా ఉన్న కుక్కల్లో పిచ్చిగా ప్రవర్తిస్తున్న ఒకటి అరుస్తూ ముందుకొచ్చింది. దీంతో అందరూ పరుగెత్తగా వరుణ్ పక్కనే ఉన్న డ్రెయినేజీలో పడిపోవడంతో కుక్క గాయపరిచింది. ఆయన అరుపులు విన్న స్థానికులు కుక్కను తరిమికొట్టారు. ఈ ప్రమాదంలో బాలుడి రెండు కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాలుడిని కరిచిన పిచ్చికుక్కను గ్రామస్తులు హతమార్చారు.



బాలుడికి చికిత్స చేస్తున్న వైద్యులు

బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడైన గంగిశెట్టి రాకేష్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తీర్పు వివరాలిలా ఉన్నాయి. 2022 నవంబర్ 26న పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పదేళ్ల బాలిక ఇంటి బయట ఆడుకుంటుండగా రాకేష్ బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లొచ్చాక బాలిక జరిగిన విషయాన్ని చెప్పడంతో రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాకేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు విచారణలో ఆయనపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రాసిక్యూటర్లు ఏ.శంకర్, జి.హరీందర్‌రెడ్డి వాదించగా బి.రామ్మూర్తి. కె.మోహన్‌రావు, జి.రవికిషోర్, ఎం.డీ.అయూబ్ సహకరించారు. కాగా, విచారణలో కీలకంగా వ్యవహరించిన ఏసీపీలు ఆంజనేయులు, బస్వారెడ్డి, భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.ఉమారాణి, ఎస్సై కె.శ్రీనివాసరావు, ఉద్యోగులు జి.రవికిషోర్, బి.రామ్మూర్తి, కె.మోహన్‌రావు, అయూబ్‌ను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

జ్వరంతో ఇద్దరు మృతి

కల్లూరురూరల్/నేలకొండపల్లి/కూసుమంచి: కల్లూరు మండలం ముగ్గ వెంకటాపురానికి చెందిన పిట్టల శాంతమ్మ (65) డెంగీ బారిన పడి మంగళవారం మృతి చెందింది. ఇటీవల ఆమెకు జ్వరం రాగా పరీక్షల చేయించడంతో డెంగీగా నిర్ధారణ అయింది. ఈమేరకు చికిత్స చేయిస్తుండగా మృతి చెందింది. అలాగే, నేలకొండపల్లి మండలం అనాసాగారానికి చెందిన వెంకటేశ్వర్లు జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడని స్థానికులు తెలిపారు. ఇక కూసుమంచి మండలం కేశ్వాపురంలో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. అధికారులు స్పందించి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

ఖమ్మం క్రైం: ప్రమాదవశాత్తు గోడ పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గార్ల బయ్యారం మండలం బర్లగూడెంకు చెందిన భూక్యా రాము(30) రోజు కూలీగా ఖమ్మంలో పనిచేస్తున్నాడు. ఆయనకు సోమవారం పని దొరకకపోవడంతో మద్యం సేవించగా.. పాత బస్టాండ్ సమీపాన ప్రహరీపై కూర్చున్నాడు. అక్కడ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. దీంతో గుర్తించిన స్థానిక పండ్ల వ్యాపారులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై ఆయన కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

దాడికి పాలడిన వ్యక్తులపై కేసు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం రెవెన్యూ పరిధిలో భూవివాదం నేపథ్యాన మంగళవారం జరిగిన దాడిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. భూమి పంపకం విషయమై లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ కాలసాని రాంబాబు ఇంట్లోకి గోసవీడుకు చెందిన వరదబోయిన గోపాలరావు ప్రవేశించి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రాంబాబుకు తీవ్ర గాయాలు కాగా ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వెంకటేశ్ తెలిపారు.

పొలం విషయంలో వివాదం

బోనకల్: మండలంలోని తూటికుంట్లలో అన్నదమ్ముల మధ్య పొలం విషయమై వివాదం తలెత్తింది. ఈమేరకు పాశం గోపమ్మపై పాశం వెంకటనర్సయ్య, సుభద్ర, కృష్ణయ్య, ధనలక్ష్మి మంగళవారం దాడి చేశారు. ఈ ఘటనలో గోపమ్మ గాయపడగా ఆమె ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుబాబు తెలిపారు.